# నీ సంస్కృతిని కాపాడుకో!

- శ్రీమతి తనికెళ్ళ కల్యాణి, ఎం.ఏ., యం.యి.డి

ప్రసాద్ భార్యను తీసికొని, కాకినాడ నుండి హైదరాబాద్ కొడుకు ఇంటికి వచ్చాడు. మర్నాడు రాత్రే దేవకి కాలిఫోర్నియా లోని లాస్ ఏంజెల్స్ కి, కూతురు దగ్గరికి ఫ్లైట్ ఎక్కుతుంది.

రవిచంద్ర నసుగుతూ "అమ్మను ఒక్కదాన్నే పంపే బదులు సాయంగా మీరూ వెళితే బాగుండేది నాన్నగారూ!" అన్నాడు.

ప్రసాద్ గట్టిగా "ఏమిటిరా బావుండేది? మొదటి కాన్పు, పుట్టింట్లో పోయాలి అని చెప్పాం కదా? వాళ్ళు విన్నారా? 'లాస్ ఏంజెల్స్' లోనే పోసుకొంటాం! మాకు పుట్టబోయే బాబుకి అమెరికా పౌరసత్వం వస్తుంది అని మంకుపట్టు. ఆరునెలలు అక్కడ నేనుండనురా!" అన్నాడు.

కోడలు సరోజ నెమ్మదిగా "అత్తయ్య గారికి అంతా కొత్త కదా మావయ్య గారు! మీరు సాయం వుంటే బావుండేది. ఇప్పుడు ఎలాగా వెళతారో అని మనకి భయం" అంది.

"ఎందుకమ్మా భయం? హెల్పర్ ని పెట్టాం కదా? ఇక్కడ ఫ్లైట్ దగ్గర మనం ఎక్కిస్తాం. హాంగ్ కాంగ్ లో హెల్పర్ సహాయంతో దిగుతుంది. మళ్ళీ లాస్ ఏంజెల్స్ ది ఎక్కుతుంది. అక్కడ మన వాళ్ళ దగ్గర వరకూ హెల్పర్ తీసుకెళతారు. మరేంటి భయం? కూతురికి నచ్చచెప్పలేక పోయినపుడు వెళ్ళక ఏం చేస్తుంది? ఇంట్లో నాతో పోట్లాడటం కాదు తిరిగి రానీ" అని సరోజతో అన్నాడు.

దేవకికి ఒళ్లుమండింది. "నా గురించి ఏ గొడవా వద్దు. ఉన్న ఒక్క రోజు సుఖంగా ఉందాం" అంది.

సరోజ కలివిడి అయిన అమ్మాయి. ఆడపడుచుకి కావలసినవి అన్నీ సర్దేసింది. అత్తగారిని కూర్చోబెట్టి భోజనాలు అయ్యాక ఆవిడ సూట్ కేసులు సర్దింది. అత్తగారికి అన్నీ చెప్పింది. ఉద్యోగస్థురాలు కాకపోతే ఆవిడకి సాయం వెళ్ళేది.

ప్రసాద్ లేబర్ ఇన్స్పెక్టర్ గా పనిచేస్తున్నాడు. ఆస్తి బాగానే వుంది. ఇల్లు, పొలాలు తో ధనవంతుడనే చెప్పవచ్చును.

"అమ్మలేదు కదా, మీకు బోలెడు సెలవు వుంది. మా దగ్గరైనా ఉండండి" అన్న రవిచంద్ర మాటలూ వినలేదు.

"సుబ్బయ్య హోటలుండగా నాకు లోటు ఏమిటి? నా ఉద్యోగం నన్ను చేయనీయండి" అని కొడుకు మాట తోసేశాడు.

"దేవకీ! భయం లేదు. కాస్త ప్రక్కవాళ్ళను పరిచయం చేసికో! హాంగ్ కాంగ్ లో వాళ్ళే నిన్ను మరొక ఫ్లైట్ ఎక్కిస్తారు. ధైర్యంగా వెళ్లిరా!" అంటూ భార్యకి విమానాశ్రయంలో వీడ్కోలు పలికాడు.

www.sirimalle.com

ముగ్గురు కూర్చునే సీట్లలో ఒకటి దేవకిది. మిగిలిన ఇద్దరూ భార్యాభర్తలు. వాళ్ళు తమ కొడుకు దగ్గరకు వెళుతున్నారు. వాళ్ళు హాంగ్ కాంగ్ లో దిగిపోయారు. ఆ దంపతుల సాయం కొన్ని గంటలే! వాళ్ళు కబుర్లలో మునిగిపోయారు.

దేవకికి భర్త మీద కోపం వచ్చింది. సెలవులు చాలా మిగిలే ఉన్నాయి. పెట్టవచ్చును  కదా! ఒక్కదాన్ని పంపేశాడు. ఆయన దులుపుకొన్నట్లు తను ఎలా దులుపుకోగలదు?

ఏడవ నెల నడుస్తోంది. తొలిసారి, దీప్తిని ఎలాగ కష్టపెట్ట గలడు? దేవకి ఆలోచనలు అందరి గురించి అలాగ నడుస్తూనే వున్నాయి.

లాస్ ఏంజెల్స్ ఫ్లైట్ లో ప్రక్కన అమెరికన్ అమ్మాయి కూర్చుంది. దేవకిని చూసి ఒక చిరునవ్వు నవ్వి, లాప్ టాప్ ఆన్ చేసికొని, చూస్తూ కూర్చుంది. దేవకి సీటు కిటికీ దగ్గర ఉంది. క్రింద ఏమీ కనబడలేదు మేఘాలు తప్ప. అమ్మో! అయితే మేఘాలను దాటి పైన ఎగురుతోందన్న మాట. దేవకి గుండె ఝల్లుమంది.

ఎయిర్ హోస్టెస్ అమ్మాయిలు చలాకీగా, బాధ్యతగా ఉన్నారు. దేవకి బెల్ట్ వాళ్ళే కట్టారు. శీతల పానీయాలు, పలహారాలు, భోజనం అన్నీ తెచ్చి ఇచ్చారు. దేవకి మనసు నెమ్మదిగా కుదుటపడింది.

లాస్ ఏంజెల్స్ రాగానే, కూతురిని, అల్లుడిని చూస్తానన్న ఆనందం కలిగింది. లగేజ్ తీసికొని, హెల్పర్ ఆమెని దీప్తి వాళ్లకు అప్పచెప్పింది.

“అమ్మా” అంటూ దీప్తి తల్లిని కౌగలించుకొంది. దేవకి కూతురిని చూసి తెల్లబోయింది.

భుజాలకు కాస్త పైనే ఉన్న కత్తిరించుకొన్న జుట్టు, స్కర్ట్, పైన కొద్దిగా లూజుగా ఉన్న టీ షర్టు, చేతులు రెండూ బోడిగా ఉన్నాయి.

శరత్ “బాగున్నారా ఆంటీ?” అంటూ పలకరించాడు. “అత్తయ్యగారూ” అన్న పిలుపు కాస్తా అంటీ గా మారి కూర్చుంది.

దేవకి తల ఊపింది. “ప్రయాణం బాగా జరిగిందా?” అంటూ కారు దగ్గరికి తీసికెళ్ళాడు.

ముందు, అల్లుడు కారు నడుపుతుంటే, దీప్తి ప్రక్కన కూర్చుంది. దేవకి వెనుక కూర్చుంది. ఎక్కడో మనసులో తన ప్రక్కన కూతురు కూర్చుంటే బావుంటుందనిపించింది.

శరత్ లాస్ ఏంజెల్స్ లో ఒక పెద్ద కంపెనీ లో సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా చేస్తున్నాడు.

కారు అందంగా ఉన్న క్రొత్త ఇంటిదగ్గర ఆగింది. ఇంటి తలుపు తాళం తీసి “మా క్రొత్త ఇంటి మొదటి అతిధి నువ్వేనమ్మా! క్రొత్తగా ఇల్లు కొన్నాడు శరత్” అంది.

దేవకి ఇంద్రభవనంలాగున్న ఇంటిని చూస్తోంది. కుడికాలు లోపలపెట్టి వస్తూ “అదేమిటే, క్రొత్త ఇల్లు కొనుక్కున్నామని చెప్పనే లేదు” అంది నిష్ఠూరంగా!

www.sirimalle.com

దీప్తి నవ్వి "ముందు ఇల్లు చూడు. నీకు సర్ ప్రైజ్ ఇద్దామని చెప్పలేదు. అంటూ చూపించసాగింది.

క్రింద రెండు పెద్ద బెడ్ రూమ్ లు, పెద్ద హాలు, మరొక ప్రక్క వంటిల్లు, డైనింగ్ టేబుల్ ప్రక్కగా దేవుడి గది, స్టోర్ రూమ్, పైన మూడు బెడ్ రూమ్ లు, అటాచ్డ్ బాత్రూం లు, క్రింద ఇంటి ప్రక్కగా కొంచెం ఖాళీస్థలం, గోడ.

ఇల్లు అంతా కేవలం కలపతో చేస్తారుట. ఇండియా లోలాగా ఇటుకలు, సిమెంటు, ఇసుకలతో  కట్టే ఇల్లు కాదు. ఇక్కడ అన్ని ఇళ్ళూ ఇలాగే కడతారట.

కబుర్లతో భోజనాలు పూర్తయ్యాయి. దేవకిని విశ్రాంతి తీసికోమని ఒక గది చూపించింది. వాళ్ళు ప్రక్క గదిలో పడుకొన్నారు.

ఇల్లు చాలా బావుంది. ఇంటికి తగిన ఫర్నిచర్ పైన ఒక గదికి బెడ్ కొనాలి. అంతే! దేవకికి తన ఇల్లు గుర్తు వచ్చింది. భర్త ఐదు గదులతో, అందంగానే కట్టారు. ఇల్లు ఆయన ఇష్టప్రకారమైనా, వంటిల్లు అంతా తన ఇష్టానికే వదిలేశారు. దేవుదిగది కూడా పెద్దదే. తను పూజించే దేవుళ్ళు అందరినీ అక్కడ కొలువు తీర్చారు. తృప్తిగా పూజ ముగించుకొని ఇవతలికి వస్తుంది.

పెద్ద పెరడు. పెరటి నిండా పూల మొక్కలు ఒక వైపు. కాయగూరలు, పాదులు ఒకవైపు. పూజకు కావలిసిన పూలన్నీ ఇంట్లోవే! మళ్ళీ ఎప్పుడు తన ఇంటికి వెళుతుందో?

వచ్చి రెండు గంటలు కాలేదు. అప్పుడే ఇంటివైపు ఆలోచనా? కూతురి కోసం తను వచ్చింది. దాని బరువు దింపాలి.

సాయంత్రం నాలుగు దాటాక తల్లిని దీప్తి నిద్ర లేపింది. "మమ్మీ! అక్కడి టైమింగ్స్, ఇక్కడి టైమింగ్స్ వేరే! మళ్ళీ రాత్రి నిద్రపట్టదు" అంది.

దేవకి మృదువుగా "ముందు ఆ 'మమ్మీ' అనడం మాను. తీయగా, హాయిగా 'అమ్మా' అని పిలువు" అంది.

దీప్తి టీ కప్పు అందించింది. దేవకి "నాకు అన్నీ చెప్పు. నేను చేసి పెడతాను" అంది.

"రెండు రోజులు రెస్ట్ తీసుకో! నిద్ర కూడా సర్దుకోవాలి కదా!" అంది దీప్తి చేత్తో జుట్టు సవరించుకుంటూ.

"ఏమంత కష్టపడి పోయానని రెస్టు? ఒక రోజు వెనుక వుండి చెప్పు. చేసికొని పోతాను" అంది ఆవిడ.

ఆ తర్వాత దేవకికి అన్నీ బాగా అర్ధమయ్యాయి. నాలుగువైపులా వండుకునే స్టవ్ లున్న ఎలక్ట్రిక్ సిస్టం, గిన్నెలు కడిగి వేస్తే తోమే డిష్ వాషర్, బట్టలుతికే వాషింగ్ మెషిన్, డ్రైయర్, ప్రతి వాష్ బేసిన్ దగ్గర వేడినీళ్ళు, చన్నీళ్ళు వచ్చే పైపులు, స్నానం చేయడానికి పెద్ద టబ్ లు. అన్నింటినీ దేవకి ఆశ్చర్యంగా చూసింది.

భర్త నుండి కూతురికి ఫోన్. "మీ అమ్మ జాగ్రత్తగా వచ్చిందా?" అని. దీప్తికి తన పొరపాటు తెలిసింది. అమ్మ రాగానే చేయవలసింది అనుకొంది. కూతురు మాట్లాడాక భార్యకి ఇమ్మనమని, ప్రయాణ విషయాలు అడిగారు.

www.sirimalle.com

చివరగా "సరే! జాగ్రత్తగా వుండు" అంటూ పెట్టేశారు. దేవకీ మురిసిపోయింది. పైకి కనపడరు కానీ తానంటే అభిమానమే.

నాలుగు రోజులు పోయాక దేవకికి అన్పించింది. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. తను ఇక్కడికి దానికి తొమ్మిదవ నెల వచ్చాక రావలసిందని. ఈ లోపు కాస్త అటూ ఇటూ పనులు చేసుకొంటూ కూతురు తిరిగితే, కాన్పు సులువు అవుతుంది కదా!

ఒకనాడు మాటలలో కూతురు అంది. "ఇక్కడ పనిమనుషులను పెట్టుకుంటే వేలు పోయాలమ్మా! బట్టలు, ఇస్త్రీ దగ్గరనుండి అన్నీ మనమే చేసుకోవాలి.

దేవకీ నిష్ఠూరంగా అంది "అలాంటప్పుడు మన ఊరిలో పురుడు పోసుకోని, బాబుకి పదవనెల వచ్చాక రావచ్చును కదా! అక్కడ అందరూ దొరుకుతారు. మాకూ పిల్లకి పురుడు పోశామన్న తృప్తి కలిగేది.  మీకు ఏం తోస్తే అదే!"

దీప్తి నవ్వుతూ "వాడికి అమెరికా పౌరసత్వం వస్తుందమ్మా! నీ మనవడు అమెరికా పౌరుడవుతాడు. మీ అల్లుడి కోరిక అదే!"

దేవకి బాగా చదువుకోక పోవచ్చును. కానీ లోకజ్ఞానం బాగానే వుంది.

ఎందరు మన దేశంలో పెద్ద చదువులు చదివి, ఇతర దేశాలకు వెళ్ళడం లేదు. అంతెందుకు పిల్లలు ఎందరు ఉపకార వేతనాల సహాయంతో ఇతర దేశాలకు చదువులకు వెళ్ళడం లేదు?  ఇక్కడే కనాలి. ఇక్కడే పుట్టాలంటే ఎలాగే? ఇప్పుడు ఇదొక అలవాటైపోయింది" నిరసనగా దేవకి అంది.

శరత్ ముస్తాబై వచ్చాడు. "ఆంటీ! మీరు పొరపడుతున్నారు. ఉన్న అవకాశం అంది పుచ్చుకోవాలి. మా పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఉంటుంది. అందుకు ఈ నిర్ణయం తీసికొన్నాం" అన్నాడు.

"బిడ్డ పుట్టే వరకూ పుట్టింట్లో విశ్రాంతిగా ఉండడం, పుట్టినవాడిని అందరం చూసి ఆనందించడం మన సంప్రదాయం. అందరూ మీ దగ్గరకు వచ్చి ఆనందించగలరా?" ఆవిడ వేదాంతంగా అంది.

"మీరు, అంకుల్, మమ్మీ, డాడీ వస్తారు కదా? వచ్చిన వాళ్ళతో సరిపెట్టుకోవాలి" అంటూ శరత్ వీధిలోకి వెళ్ళిపోయాడు.

దేవకీ మౌనం వహించింది. మంచి రోజు చూసి తను తెచ్చిన స్వీట్స్ కూతురికి అందించింది. శరత్ తల్లి తండ్రులకు పంపించే పని కోడలు స్వీకరించింది.

శరత్ స్నేహితులందరూ కుటుంబాలతో వచ్చారు. సంప్రదాయంలో భాగంగా తను తీసుకువచ్చిన ఖరీదైన పట్టుచీర, నెక్లస్, శరత్ కి బట్టలు అందించింది. వచ్చిన అతిధులందరికీ మంచి సంప్రదాయ భోజనం ఏర్పాటుచేసింది.

రాత్రి అలసటతో పక్కచేరినా నిద్రాదేవత దేవకిని కరుణించలేదు. భర్త, కొడుకు, కోడలు లేని వెలితి ఆమెను బాధించింది.

తన దగ్గర ఇరవై ఒక్క ఏళ్ళు పెరిగిన పిల్ల, ఇక్కడికి వచ్చేవరకూ ఒక పద్ధతిలో పెరిగిన కూతురిలో ఇంత మార్పా?

www.sirimalle.com

దీప్తి వాళ్ళ ఇంటికి దగ్గరలోనే ఒక పార్క్ వున్నది. కూతురు అటు, ఇటు నడవవచ్చని దేవకిని అక్కడికి తీసుకువెళ్ళేది.

దేవకి, అక్కడికి వచ్చే అందరినీ గమనించేది. వాళ్ళ దుస్తులు, ఉత్సాహం చూసేది. ఇతరుల పట్ల చాలా మర్యాదగా ప్రవర్తిస్తారు. నడిచే వారి కోసం ఏర్పరిచిన సూచికలు, నడిచేవారు రోడ్డు దాటేవరకూ కార్లు కూడా బారులుగా ఆగడం ఆవిడకు నచ్చింది. రోడ్డు ప్రమాదాలు చాలా తక్కువగా జరుగుతాయి. అందరూ మన దేశంలో లాగా కాకుండా ఖచ్చితముగా అక్కడి నిబంధనలను పాటిస్తారు.

పార్క్ లో ఒంటరిగా కూర్చున్నప్పుడు, దేవకి బిడ్డను మందలించింది.

"ఇక్కడికి వచ్చే వరకూ ఎంత చక్కగా పొందికగా ఉన్నావు? ఈ మోకాలు వరకూ కూడా రాని స్కర్ట్, స్లీవ్ లెస్ టాప్ ఏమిటి? ఒళ్లంతా కనబడటం లేదా? కడుపుతో ఉన్న వాళ్ళు వదులుగా వుండే దుస్తులు ధరించాలి. ఈ ఇరుకు బట్టలు ఏమిటి?" అంటూ నిలదీసింది.

దీప్తి ఇబ్బందిగా తల్లి వైపు చూస్తూ స్కర్ట్ ని కాస్త క్రిందకు సర్దుకోబోయింది. అవలేదు. తెల్లటి మోకాలు పైభాగం కన్పిస్తోంది. లావుగా నున్న కాళ్ళు కన్పిస్తున్నాయి. గర్భవతి కనుక ఒళ్ళు చేయడం సహజం. నున్నగా ఉన్న తెల్లటి జబ్బలు, చేతులు, అలాగా పదిమంది కంటపడటం ఆవిడకి చిరాకుగా వుంది.

దేవకి  వైపు చూస్తూ, "ఇక్కడ ఇలాంటివి వేసుకోవడం మామూలే మమ్మీ" అంది దీప్తి.

దేవకి చిరాకుగా "ముందు ఆ 'మమ్మీ' అనడం మానేయి. నోరారా, ఇదివరకు లాగా 'అమ్మా' అని తీయగా పిలు. అంతేకాదు, నువ్వు ఆ పాంటులు, టీ షర్టు లు జీన్స్ మాను" అంది.

"రోమ్ లో వుంటే రోమన్ లాగా ఉండాలిట. ఇక్కడ ఉన్నాం కనుక ఈ ప్రభావం" దీప్తి తల్లికి సర్దిచెబుతూ అంది.

దేవకి ఆవేశంగా "ఏ దేశమేగినా, ఎందుకాలిడినా, ఏ పీఠమెక్కినా, ఎవ్వరెదురైనా, పొగడరా నీ తల్లి భూమి భారతిని, నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అని రాయప్రోలు సుబ్బారావు అనలేదా?" అని అంది.

"పిచ్చిపిల్లా! కూతురు తప్పు మార్గంలో నడుస్తుంటే తల్లి సరిదిద్దాలి" అని కూడా అంది.

దీప్తికి కోపం వచ్చింది. అయినా కూడా తమాయించుకొని, "నేను ఏం తప్పుమార్గంలో వెళుతున్నానమ్మా, మీ అల్లుడికి కూడా నేను ఇలాగ ఉండటం ఇష్టం" అంది.

దేవకి మృదువుగా నవ్వింది. పసిపాప తప్పటడుగులతో ఎక్కడ పడిపోతుందోనని జాగ్రత్తగా అనుసరించే తల్లిలాగా ఎంతో సహనం కనపడుతోంది.

www.sirimalle.com

"ఇప్పుడు మనదేశంలో మాత్రం ఇలాగా రకరకాలైన ఆధునిక వస్త్రధారణ వేస్తున్న వారు లేరా? జుట్టు కత్తిరించుకుని ఇంతకంటే షోకులు పోవడం లేదా?" తల్లిని నిలదీస్తున్నట్లు అడిగింది దీప్తి.

దేవకి దీప్తి మాటలకు కోపం తెచ్చుకోలేదు. ఓర్పుగా "పెడత్రోవన వెళతామనే వాళ్ళు, వెళుతున్న వాళ్ళు లోకంలో చాలామందే ఉన్నారు. అందుకే అన్ని అత్యాచారాలు జరుగుతున్నాయి. పెళ్ళికి ముందు నల్లత్రాచు లాంటి పెద్ద జడతో, తలలో పూలతో, చక్కటి చీర కట్టులో ఎంత అందంగా వుండేదానివి. కంటికి కాటుక, నుదుటికి బొట్టు ఇచ్చే అందం ఈ చిన్న చుక్కతోనో, స్టికర్ తోనో వస్తుందా?

ప్రపంచమంతా భారతీయ స్త్రీ ని ఎందుకు గౌరవిస్తారో తెలుసా? మన సంప్రదాయ వస్త్రధారణ, కట్టు బొట్టు మనకు అంత గౌరవాన్ని అందిస్తున్నాయి.

నీ జడ, పూలు నీకు ఎంతో అందాన్ని ఇస్తాయి. పరభాషలను నేర్చుకో, వారి సంస్కృతిని గౌరవించు, అందులోని మంచిని గుర్తించు. కానీ నీ భాషను, సంస్కృతినీ విడనాడకు. నీ ఉనికికి మూలం నీ దేశ సంస్కృతి అని మరిచిపోవద్దు. నీదైన సంస్కృతిలో, సంప్రదాయంలో నువ్వు నడిస్తేనే నీకు గౌరవం, నిండుతనం. పదిమందికి ఆదర్శ ప్రాయురాలవుతావు" అని విశదీకరించింది.

దీప్తి తల్లి మాటలను అర్థం చేసుకొంటూ, మౌనంగా ఉండిపోయింది. శరత్ కి కూడా చెప్పాలనుకొంది.

మర్నాడు టిఫిన్ తయారుచేస్తున్న దేవకికి, తన గదిలోనుండి డైనింగ్ టేబుల్ దగ్గరకు వస్తున్న దీప్తి కన్పించింది. తేలికైన అందమైన కనకాంబరం చీరతో, దాని అంచుకి సరిపడే జాకెట్టుతో, నుదిటిపై బొట్టుతో, జుట్టును రబ్బర్ బ్యాండ్ తో బంధించి, నల్లటి కాటుక కళ్ళు కాంతులీనుతుండగా, గర్భ భారంతో నెమ్మదిగా నడచివస్తున్న దీప్తిని చూసి దేవకి మొహం ఆనందంతో వెలిగిపోయింది. "నా దీప్తి నాకు వారసురాలు" అని తృప్తిగా దేవకి అనుకొంది.